## మానవత్వాన్ని చాటుకున్న బస్సు కండక్టర్

**మేడ్చల్, జూన్3. ప్రభాతవార్త :** బస్సులో మర్చిపోయిన బ్యాగును తిరిగి పోగొట్టుకున్న వారికి అందజేసిఆర్టీసీ కండక్టర్ మానవత్వాన్ని చాటు కున్నారు. కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన బాసర ఐఐటీ విద్యార్థిని అక్షయ మేడ్చల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణించితనబ్యాగును మర్చిపోయించి. బస్సులో ఉన్న బ్యాగును గుర్తించిన



కండక్టర్ ఎస్ మంగమ్మ అందులో విలువైన ల్యాప్‌టాప్ ఉన్నట్లు గమనించి వెంటనే డిపో మేనేజర్ సుధాకర్‌కు అందజేశారు. అనంతరం ఆ విద్యార్థినికి సమాచారం అందించి గురువారం డిపోలో ఆ బ్యాగును తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా కండక్టర్ మంగమ్మను అభినందించారు. ° అసిస్టెంట్ మేనేజర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## నేడు సీఐ కార్యాలయం భవన నిర్మాణానికి భూమిపూజ

**కొడంగల్,జూలై 3 ప్రభాతవార్త:**



కొడంగల్‌పోలీస్‌స్టేషన్ సీఐకార్యాలయంతోపాటు దుద్యాల పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాలకు శుక్రవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించ నున న్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. ఈ మేరకు గురువారం స్దానిక సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ. సత్య నారాయణలు ఏర్పాట్లును పరిశీలించారు. ఈ కార్య క్రమానికి రాష్ట్ర పోలీస్ ఉన్నతా ధికారులతో పాటు తెలంగాణా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మేన్ గురునాధ్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రేస్ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి, జిల్లా కలెక్టర్, ప్రతీక్ జైన్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సీఐ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్‌ల నిర్మాణానికి సుమారు రూ.4కోట్ల నిధులతో భూమి పూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టునున్నారు.

## నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తుల ఆందోళన



ఎంపిడివో కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మహిళలు,యువకులు నిరసన

**పరిగి జులై 3, ప్రభాతవార్త :**

వికారాబాద్ జిల్లా పరిగి మండలం బర్కత్ పల్లి గ్రామంలో గత పదిహేను రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తాగునిటి సమస్యను పరిష్కరించాలంటూ పరిగి ఎంపిడిఓ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో మహిళలు,గ్రామ యువకులు నిరసన చేపట్టారు. తమ గ్రామంలో నీటి సమస్య వెంటనే తీర్చాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు.. మిషన్ భగీరథ నీటి సరఫరా ఉన్నప్పటికీ పైప్ లైన్లు సరిగ్గా లేక, వాటిని మరమ్మతులు చేయకపోవడంతో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు.. గ్రామ పంచాయతీ సెక్రటరీ కి పలుమార్లు సమస్య గురించి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామ పొలిమేరలో ఉన్న బోర్ల వద్ద నుండి నీళ్ళు తెచ్చుకుంటున్నామని, త్రాగు నీటి కోసం కష్టాలు పడుతున్నామని తెలిపారు. వెంటనే తమ సమస్య తీర్చాలని, అధికారులకు వినతిపత్రం అందించడానికి ఎంపీడీవో కార్యాలయానికి గ్రామస్తులు వచ్చినా, ఉదయం పదిన్నర దాటినా ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్ కు తమ ఫిర్యాదు ఇచ్చి వెళ్లిపోయారు.

**రెండు రోజుల్లో పరిష్కారం:**

సమస్యను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని, గురువారం ఉదయమే మిషన్ భగీరథ అధికారులతో చర్చించి మరమ్మత్తులను చేయించేలా పనులు చేపట్టామని పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తెలిపారు.. భగీరథ పైపులైన్ మరమ్మతులు ఉన్నాయని , గ్రామంలోని భావి నుంచి వాటర్ ట్యాంకు కు నీటిని పంపించి ఇళ్లకు సరఫరా చేస్తున్నామని, బోరు మోటారు కనెక్షన్ ఉన్న ట్రాన్సాఫ్ఫర్మర్ పది రోజుల ముందు కాలిపోయిందని, దానివల్లే ఆలస్యమైందని తెలిపారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు.

## ఫార్మా వ్యతిరేక పాదయాత్ర



ఫార్మా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న రైతులు కూలీలు గ్రామస్తులు

**యాచారం జులై 3 ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని కురుమిద్ద నాన్నకునగర్ తాడిపర్తి మేడిపల్లి గ్రామాల ప్రజలు ఫార్మసిటిని రద్దు చేయాలంటూ కురిమిద్ద నుండి మేడిపల్లి వరకు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కురుమిద్ద అంబేద్కర్ విగ్రహం నుండి నుండి మేడిపల్లి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ఎత్తున రైతులు అలా చేస్తూ నాలుగు గ్రామాల రైతులు రైతు కూలీలు మాజీ సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ కన్నెగంటి రవిపర్యావరణవేత బాబురావు ఆధ్వర్యంలో పాల్గొన్నారు. రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం ఇవ్వని 2500 ఎకరాల భూమిని మినహాయించి ఆన్లైన్లో రైతుల పేర్లు ఎక్కించి రైతు భరోసా కల్పించాలని పాదయాత్ర నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ పకారం రైతుల హక్కులని కాపాడాలని లేకుంటే రాబోయే రోజుల్లో భారీ ఎత్తున యాచారం మండల రైతులు రైతుల, ప్రజలందరిని కలుపుకొని భూసేకరణకువ్యతిరేకంగాపోరాటంచేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించరించారు. గతంలో మీ భూములు ఇవ్వకండి వచ్చేది మన ప్రభుత్వమే మీ భూములు మీకే వదిలిపెడతామని చెప్పిన నాయకులు ఇప్పటివరకు ఎలాంటి సమస్య పరిష్కారం చేయలేదు త్వరలో భవిష్యత్ కార్యక్రమంరూపొందించి మా హక్కులకోసం పోరాడుతామని హైకోర్టు ఆర్డర్‌నుగౌరవించి ఆన్లైన్లో ఎక్కించాలని రైతుబంధు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, కుందారపు నారాయణ, మాజీ సర్పంచులు బందె రాజశేఖర్ రెడ్డి, దూస రమేష్, దంతుకపెద్దయ్య పోరాట కమిటీ సభ్యులు కానమోని గణేష్, కొండల్ రెడ్డి పాపి రెడ్డి, అచ్చిరెడ్డి, ముత్యాల మైపాల్ రెడ్డి, సాయి రెడ్డి, బర్ల మల్లేష్, సామ నిరంజన్, నాగరాజు, పంగ వినోద్ రెడ్డి, శ్రీకాంత్ నాయక్, రాజు, శంకర్ అనసూయమ్మ, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## గుండ్లపోచంపల్లి పాఠశాలలో అదనపు గదులు నిర్మాణం

**మేడ్చల్, జూన్ 3. ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలబలోపేతానికి ఎల్లవేళలా సహకారం అందిస్తామనిఇంటిగ్రేటెడ్‌క్లీన్‌రూమ్ టెక్నాలజీస్ (ఐక్లీన్) కంపనీ చైర్మన్ గోపి అన్నారు. గుండ్లపోచంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ 46 లక్షల నిధులతో ఐక్లీన్ కంపనీ అదనపు గదులు, భోజనశాల, వేదిక షెడ్డు నిర్మాణంతో పాటు పాఠశాల భవణానికి రంగులు వేయించారు. ఈ



గదులను గురువారం ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండ్లపోచంపల్లిలోని ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి గత 20 సంవత్సరాలుగా తన వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. సమాజానికి తన వంతు సహకారంగా పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలకు గదులను నిర్మించామని చెప్పారు. బీజేపీ నాయకుడు అమరం మోహన్‌రెడ్డి సూచన మేరకు సదువుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపనీ ఎండీ ఒకేజిమ్, వైస్ చైర్మన్ మాధవరావు, వైస్ ప్రసిడెంట్ శ్రీకాంత్, హెచ్‌ఆర్ గోపీచంద్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, అమరం సరస్వతి, నాయకుడు శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం

**పరిగి జులై3 ప్రభాతవార్త :**

వికారాబాద్‌జిల్లా పరిగి మండలం రంగాపూర్ శివారులో హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి తర్వాత గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పరిగి మండలం రుప్ ఖాన్ పేట్ గ్రామానికి చెందిన అస్లాం(24) తన ద్విచక్ర వాహనంపై గ్రామానికి తిరిగి వస్తుండ గా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్నపోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# ఓటర్ల వివరాల మార్పులు చేర్పులపై బూత్ స్థాయిలోనే పరిశీలించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**కొడంగల్,జూలై 3ప్రభాతవార్త**

బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్ధాయిలో ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను పరిశీలించాలని, అలాగే మార్పులు చేర్పులపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం కొడంగల్ నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్నికల కమీషన్ అదేశాల మేరకకు బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్‌లకు జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 6,7,8నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ జాబితాలో అవసరమైనచో పాత ఫోటోలు తొలగించి, ఓటర్లకు సంభందించిన నూతన ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. పేర్లలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా క్షేత్రస్దాయిలో పరిశీలించి జాబితాను సవరించాలన్నారు.

ఫారం 6 ద్వారా కొత్త ఓటర్లు నమోదు చేయాలని, కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదు అయ్యేలా చూడాలని బూత్ లెవల్ అధికారులకు సూచించారు. మరణించినవారి పేర్లను తొటలించేందుకు నిబంధనలు పాటించి ఫారం 7 ద్వారా తొలగించాలని, మరణ ద్రువీకరణపత్రం తప్పనిసరిగా పొందాలని తెలిపారు. చేర్పులు, పేరు మార్పులు కొరకు పారం 8 వినియోగించాలని పేర్కొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్‌కుమార్, బూత్ లెవల్ అధికారులు, అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ అబ్దుల్ హక్ ,క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

### ఖానాపూర్‌లో అంధకారం...

# ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చరు..సమస్య పరిష్కరించరు !!

**నాలుగు రోజులుగా కరెంటు సరఫరా బంద్**

**...తాగునీటి కోసం అల్లాడుతున్న జనం !**

**స్పందించని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది**

**పెద్దేముల్, జులై3, ప్రభాతవార్త:** గత నాలుగు రోజులుగా కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ఖానాపూర్ గ్రామం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. ఫలితంగా తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పెద్దేముల్ మండలం ఖానాపూర్ గ్రామంలో గత నాలుగురోజులుగా కరెంటు సరఫరా నిలిచిపోవడంతో చీకట్లు అలముకున్నాయి. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు మండిపడుతున్నారు. విద్యుత్ అధికారులకు, సిబ్బందికి పదేపదే విన్నవించిన ఇటు వచ్చి అటు వెళ్ళిపోతున్నారే తప్పా శాశ్వత పరిష్కారం కావడంలేదనివాపొతున్నారు. వర్షాకాలంలో కరెంటు లేకపోవడంతో క్రిమికీటకాలతో భయాంధోళనలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అంతేగాకుండా తాగునీటి కోసం ఘోస పడుతున్న అడిగే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఎప్పుడు ఫోన్ చేసిన విద్యుత్ అధికారులు, సిబ్బంది తమ ఫోన్‌లను లిఫ్ట్ చేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వర్షాకాలంలోను తాగునీటికి తిప్పలు తప్పడంలేదంటే



ఖానాపూర్‌లో పనిచేయని ట్రాన్స్‌పార్మర్

తమ పరిస్తితి ఎందో అర్ధంచేసుకోవచ్చని విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని పలుమార్లు విన్నవించిన అధికారులు, సిబ్బంది పెడచెవిన పెడుతున్నారని పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చకపోవడంవల్ల ఫీజులు ఎగిరిపోయికరెంటు సరఫరా నిలిచిపోతోందని, తద్వారా తాగునీటికి తిప్పలు తప్పడంలేదని వాపొతున్నారు. నాలుగు రోజులుగా తాగునీరు, కరెంటు లేక అరిగోసపడుతున్న పాలకుల, అధికారులలో చలనంలేకుండా పోతోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారంఅయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విన్నవిస్తున్నారు.

## ఎంపిడిఓను కలిసిన మాల్ గ్రామస్తులు



**యాచారం జులై 3 ప్రభాతవార్త :**

యాచారం మండలంలో నూతన ఎంపీడీవో గా బాధితుల స్వీకరించిన రాధా రాణిని మాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో ఘనంగా బుధవారం సన్మానించారు. పలు అభివృద్ధి అంశాలపై యాచారంలో మాల్ అతిపెద్ద గ్రామపంచాయతీ అని జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు అందిందని మరింత అభివృద్ధికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాల్ మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ జహంగీర్, యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షులు గొల్లపల్లి భాస్కర్ గౌడ్, మాల్ గ్రామ శాఖ అధ్యక్షులు గుడు గుంట్ల రమేష్, మాల్ టౌన్ అధ్యక్షులు గిరి గాలయ్య, మాల్ జిల్లా పరిషత్ హై స్కూల్ మాజీ చైర్మన్ గుడు గుంట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల వారీగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**పురపాలిక ప్రగతికి రూ.39.72 కోట్లు**

**5 నుండి అభివృద్ధి పనులకు శ్రీకారం**

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్**

**షాద్‌నగర్,ప్రభాతవార్త,జూలై3 :** షాద్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంకల్పించారని, అందులో భాగంగా టీయూఎఫ్ఐడీసీ పథకం ద్వారా వార్డుల వారీగా పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసినట్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్ వెల్లడించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణాలు ఎక్కువగా చేపడుతుండగా, పార్కుల అభివృద్ధి, ప్రహరీగోడ నిర్మాణం వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు. వార్డుల వారీగా విద్యుదీకరణలో భాగంగా పాత స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం, పాత వైర్లను తొలగించి కొత్త వైర్లను అమర్చి లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈనెల 5 నుండి ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వివరించారు.

మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని 1వ వార్డులో కోటి 84 లక్షల 70 వేల రూపాయలతో 9 పనులకు నిధులు మంజూరు చేయగా, 2వ వార్డులో సీసీ రోడ్లు, అంతర్గత మురుగుకాల్వల నిర్మాణాలకు కోటి 25 లక్షల 80 వేలతో ఐదు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 3వ వార్డులో సీసీ రోడ్లు, అంతర్గ కాలువలకు 3 కోట్ల 71 లక్షల 30 వేల రూపాయలతో 5 పనులు, 4వ వార్డులో సీసీ రోడ్ల కోసం రూ.77.50 లక్షలు, 5వ వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాల్లకు రూ.90 లక్షలు, 6వ వార్డులో 17 పనులకు గాను 3 కోట్ల 12 లక్షల 40 వేలు, 7వ వార్డులో సీసీ రోడ్లు, అంతర్గ కాల్వల నిర్మాణానికి 4 కోట్ల 84 లక్షల 25 వేలు, 8వ వార్డులో రూ.77.95 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, 9వ వార్డులో పార్కు అభివృద్ధి పనులతో పాటు సీసీ రోడ్లు, అంతర్గత కాల్వలకు గాను 3 కోట్ల 56 లక్షల 30 వేలు, 10వ వార్డులో సీసీ రోడ్లు, బీటీ రోడ్డు, కల్వర్టు, ప్రహరీకి రూ.4 కోట్ల 17 లక్షల 40 వేలు, 11, 12, 13, 15వ వార్డులకు ఎలాంటి నిధులు కేటాయించకపోగా 14 వార్డులో ఫరూఖ్‌నగర్ హైస్కూల్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు సీసీ రోడ్ల నిమిత్తం రూ.90 లక్షలు, 16వ వార్డుకు రూ.79.70 లక్షలు, 17వ వార్డులో 10 అభివృద్ధి పనులకు రూ.95.72 లక్షలు, 18వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి ఒక కోటి మూడు లక్షలు, 19, 20, 21వ వార్డుల మీదుగా పటేల్ రోడ్డు అభివృద్ధికి ఒక కోటి 20 లక్షలు, 22వ వార్డులో సీసీ రోడ్ల నిమిత్తం రూ.83.50 లక్షలు, 23వ వార్డులో సీసీ రోడ్లతో పాలు మరో పది పనులకు ఒక కోటి 13 లక్షల 50 వేలు, 24వ వార్డులో సీసీ రోడ్లకు 94 లక్షలు, 25వ వార్డులో రెండు సీసీ రోడ్ల నిమిత్తం ఒక కోటి 50 లక్షల 50 వేలు, 26వ వార్డులో పార్కు అభివృద్ధి కోసం రూ.25 లక్షలు, 27వ వార్డులో సీసీ రోడ్లు, కాల్వలతో పాటు రెండు పార్కుల అభివృద్ధి కోసం మూడు కోట్ల 32 లక్షల 70 వేలు, 28వ వార్డులో సీసీ రోడ్ల కోసం రూ.68.50 లక్షలు కేటాయించినట్లు మహ్మద్ అలీఖాన్ బాబర్ తెలిపారు.

# సమస్యలతో సతమవుతున్న చేవెళ్ల బాలికోన్నత పాఠశాల

- -శిథిలావస్థలో భవనాలు..
- -భయం గుప్పిట్లో..బాలికలు
- -నిరుపయోగంగా మరుగుదొడ్లు.
- -ఇబ్బందుల్లో పాఠశాల బాలికలు
- -600 మంది బాలికలకు వాష్‌రూం లేవు

**చేవెళ్ల, జూలై3, ప్రభాతవార్త:** చేవెళ్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. శిథిలావస్థలోకి భవనాలు చెరుతున్నా సబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో భయం గుప్పిట్లో బాలికలు కాలం గడుతుపుతున్నారు. వాష్‌రూంలు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు పాఠశాలలో 600 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వారికి ఒక్క వాష్ రూం కూడ లేదు. పాఠశాలకు రావాలంటే బాలికలు జంకుతున్నారు. బాలికలకు సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదు. పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. బాలికల పాఠశాలపై పర్యవేక్షించే నాదుడే కరువయ్యరు. చేవెళ్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన పాఠశాల





సంక్షోభంలో కొట్టుమిట్లాడుతన్నాయి. ప్రభుత్వం ఏటా కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న బూడిదలోపోసిన పన్నీరే అవుతుంది. ప్రభుత్వం నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపంవంటి కారణాలుతో పాఠశాల దుస్దితి అద్వాన్నంగా తయారైంది. చేవెళ్ల పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తాగునీరు, మూత్రశాలు లేవు. విద్యార్దులకు సరిపడా తరగతి గదులు కూడ లేవు. చేవెళ్ల మండల కేంద్రంలోని పాఠశాల మరమ్మత్తుకు నోచుకోవడంలేదు. దీంతో విద్యార్థినులు పడుతున్న అవస్థలు వర్ణాతీతంగా మారాయి. బాలికల పాఠశాలవర్షం కురిస్తే తరగతి గదులు వర్షం నీటితో నిండిపోతుంది .తరగతి గదులకు కిటికీలులేవు. తలుపుల్లేవు. గోడలకు పగుళ్లొచ్చాయి. పైకప్పుపెచ్చు లూడు తున్నాయి. వర్షం కురిస్తే గదుల్లోకి నీరు చెరుతుంది. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువైబాలికలు అవస్దలు పడుతున్నారు. తాగునీటీ సౌకర్యంలేక ఇంటి నుంచే విద్యార్దుల నీటిని తెచ్చు కుంటున్నారు. మరుగుదొడ్లు లేకపోవడం ఇబ్బందైతే నీరులేక మరోక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బాలికలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాఠశాల నుండి ఇంటికి వెళ్తున్నారు. పాఠశాలలో కాలకృత్యాలు తీర్చు కోవాలంటే ఇంటికి వెల్లాల్సి వస్తుంది. మూత్రశాలలు, మరుగు దొడ్ల, తాగునీటి సౌకర్యం లేక విద్యార్దులు ఉపాధ్యాయులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. పాఠశాల భవనాలు పురాతన కావడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. విద్యార్దులకు మూత్రశాలలు, మరుగదొడ్లు లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొ ంటున్నారు. పాఠశాలలో రోజు రోజుకు కొత్త సమస్యల ఎదురౌతున్నాయి. పారిశుధ్య సమస్య కూడ విద్యార్దినులను పట్టిపిడిస్తుంది. అపరిశుభ్రతతో పాఠశాల అవరణ దర్శనమిస్తుంది. అధికారులు, నాయకులు స్పందించి చేవెళ్లజిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను తీర్చాలని విద్యార్దులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## ఘనంగా నల్లపోచమ్మ దేవాలయంలో మండల పూజలు



**అత్తాపూర్ జూలై 3, ప్రభాతవార్త :**
అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ శ్రీ నల్లపోచమ్మ దేవాలయం మండల పూజ మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అసోసియేషన్, ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన యంత్ర ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన చేసుకొని 41 రోజులు పూర్తైన సందర్భంగా అమ్మవారి శిఖరానికి కుంభాభిషేకం, హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న దాన కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ పూజల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బహిరంగ సభకు పెద్దఎత్తున్న తరలివెళ్లాలి

**-ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**అత్తాపూర్ జూలై 3, ప్రభాతవార్త :**
ఎల్బీ స్టేడియంలో జరిగే ఏఐసిసి అధ్యక్షుడు ఖర్గే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పెద్దఎత్తున్న తరలివెళ్లాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు.గురువారం మైలార్‌దేవ్ పల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ....శుక్రవారం (నేడు) ఎల్బీ స్టేడియంలో జరిగే మల్లికార్జున ఖర్గే బహిరంగ సభను విజయవంతం చేయడానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుండి భారీగా తరలివెళ్లాలని అన్నారు.పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని పేర్కొన్నారు.సభకు భారీగా తరలివెళ్లి కాంగ్రెస్ సత్తాచాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## కారులో మంటలు...తప్పిన ప్రమాదం

**అత్తాపూర్ జూలై 3, ప్రభాతవార్త :**
ప్రయాణిస్తున్న ఓ కారులో మంటలు చెలరేగిన ఘటన మైలార్‌దేవ్ పల్లిలో చోటుచేసుకుంది.షాద్‌నగర్ నుంచి సుదర్శన్ అనే వ్యక్తి తన క్విడ్ కారులో టీఎంక్ నగర్ వైపు వెళ్తున్నాడు.ఈ క్రమంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పక్కన భారత్ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకుని బయటకు వెళ్తుండగా కారు ఇంజన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.దీంతో వెంటనే అప్రమత్తమైన పెట్రోల్ బంకు సిబ్బంది మంటలను అర్పివేయడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది.కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సిబ్బందితో పాటు స్థానికులు భయాందోళనకు గురైయ్యారు.

## ఆంధ్రా కులాలను బిసి జాబితాలో కలపొద్దు

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత**

**ముషీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** తెలంగాణలో తొలగించిన 27 ఆంధ్రా కులాలను బీసీ జాబితాలో కలపవద్దని తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వినతిపత్రం అందచేశారు. ఆంధ్రా కులాలను తిరిగి బీసీ జాబితాలో కలిపితే తెలంగాణ బీసీలకు అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి బీసీలకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు డాక్టర్ భాగయ్య, గడప శ్రీహరి, కంటే రామచందర్, మల్లేష్, కొమరయ్య, అంబటి సుధాకర్ గంగపుత్ర పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌ను కలిసిన బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జులై 3, ప్రభాతవార్త**
టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ గురువారం కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను మూసాపేట్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వర్షాకాలం వరదలను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించాలని సూచించారు.

## అధికారులు అంకితభావంతో పనిచేయాలి

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

**ముషీరాబాద్, జూలై 3, ప్రభాతవార్త:** రాబోయే బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క అధికారి అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ కార్యాలయంలో అధికారులతో కలసి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, వీధి దీపాల సమస్యలు ఎక్కడ ఉన్నా తక్షణమే మరమ్మత్తులు చేయాలని, అవసరమైతే కొత్త వాటిని ఏర్పాటుచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జోనల్ కమీషనర్ రవికిరణ్, డిప్యూటి మున్సిపల్ కమీషనర్ మారుతి దివాకర్, అసిస్టెంట్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హేమలత, జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంతి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలోకి టిఆర్ఎస్ (డి)

**సైఫాబాద్, జులై 3 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (డి) అభ్యర్థిని ఎన్నికల భరిలోకి దించుతామని సమితి తెలిపింది. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ పోటి చేసే అభ్యర్థి కంచర్ల మంజుష పేరును కూడా ప్రకటించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తమ పార్టీకి 5 వేలమంది సభ్యత్వం ఉందని, ఇంకా కొనసాగుతున్నదని, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్ర చేపడతామన్నారు. విద్యావంతురాలైన కంచర్ల మంజుషకు ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, రాజకీయ నేపథ్యం కుటుంబం నుంచి వచ్చిన ఆమె తమ పార్టీలో కార్యనిర్వహక అధ్యక్షురాలిగా కొనసాగుతున్నదని చెప్పారు. బనకచర్ల లింకు ప్రాజెక్టుపై ఈ నెల 19న తేదీన తమ పార్టీ ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నదని, ఎపి ప్రభుత్వం 200 టిఎంసి గోదావరి జలాలను కృష్ణ బెసిన్ మీదగా పెన్నా బెసిన్‌కు మళ్లించేందుకు గోదావరి-బనకచర్ల లింకు ప్రాజెక్టును సుమారు 80 వేల కోట్లతో చేపడుతున్నదని ఆరోపించారు. 3వేల టిఎంసి నికర జలాలను ఉపయోగించుకుంటే రాష్ట్రంలో 4 పంటలు పండించుకోవచ్చునని సూచించారు.

## భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద వేదాలు : డా. కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, జూలై 3 ప్రభాతవార్త :** భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద వేదాలని, అవి మన జ్ఞానానికి మూలం... వాటిని లోతుగా పరిశీలించి అధ్యయనం చేయాలని తద్వారా ఆధ్యాత్మిక, మానసిక వికాసశక్తి పెరుగుతుందని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఢిల్లీ దూరదర్శన్ పూర్వ అదనపు డైరెక్టర్ డా. రేవూరి అనంత పద్మనాభరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు మల్లం వీరేందర్, సవరం వెంకటేశ్వరరావు, డా. వి.ఎ.కుమారస్వామిశాస్త్రి, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ తదితరులతో ప్రముఖ రచయిత డా. చిట్టావూరి శివరామకృష్ణశర్మ రచించిన ఋగ్వేదానికి రాహుల్ గ్రహం గ్రంథాన్ని ఆవిష్కరించి రచయితను ఘనంగా సత్కరించి ప్రసంగించారు. దేశాన్ని మొగల్ చక్రవర్తులు, అనంతరకాలంలో బ్రిటిష్‌వారు పాలించిన సమయంలో అత్యంత విలువైన భారతీయ వేదాలు, వైద్య విజ్ఞానశాస్త్రాలు వక్రీకరణ జరిగాయన్నారు. రచయిత తన ఆంగ్ల గ్రంథంలో మనదేశ వాస్తవిక చరిత్ర మార్పులుతో వక్రీకరణకు గురైన వివరాలు సహేతుకంగా వివరించారన్నారు. అలాగే రాహుల్ సాంకృత్యాయన్ ఋగ్వేదంపై చేసిన వక్రవ్యాఖ్యానాలను శర్మ తన తెలుగు గ్రంథంలో తీవ్రంగా ఖండించారని తెలిపారు. రచయిత తన స్పందనలో సత్యాన్ని సమాజం ముందు ఉంచాలనే ప్రయత్నం చేస్తున్నానని స్పష్టం చేశారు.



ఋగ్వేదానికి రాహుల్ గ్రహణం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, పద్మనాభరావు, రఘురామ్ తదితర అతిథులు

## కొలకలూరి ఇనాక్ సాహిత్యం మానవీయతకు ప్రతీకలు : ఏనుగు నరసింహా రెడ్డి

**చిక్కడపల్లి, జూలై 3 ప్రభాతవార్త:** కొలకలూరి ఇనాక్ దళిత వాద సాహితీ వేత్త గా భావిస్తారు అని, కాని ఆయన అణగారిన వర్గాల పక్షపాతి అని ప్రముఖ సాహితీ వేత్త ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. ఆయన సాహిత్యం మానవీయతకు ప్రతీకలు అని ఉదహరించారు. గురువారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గాన సభ నిర్వాహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తహం లో భాగంగా డాక్టర్ అరుణ గంధం రచించిన కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఏనుగు నరసింహా రెడ్డి పాల్గొని సంపుటి నీ ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు సాహిత్యంకు మంచి కానుక అరుణ అందించిన ఇనాక్ సాహిత్యం పై వ్యాస సంపుటి అని అభినందించారు. సినీ కళాకారులకు అభిమాన సంఘాలు వుంటాయని, కానీ ప్రజా చైతన్యం కోసం జీవితమంతా కృషి చేసే సాహితీ కారులకు అభిమాన సంఘాలు లేక పోవటం విచార కరం అన్నారు. గాన సభ వారు ఏడు సంవత్సరాలు గా ఇనాక్ సాహితీ సప్తహం నిర్వహిస్తూ ఆయనకు అభిమాన సంఘంగా మారారని అభివర్ణించారు. ఇనాక్ కు జ్ఞాన పీఠం ఇంకా రాకున్నా దానికన్నా ఎత్తు పీఠంకు ఎదిగిన సాహితీ ఋషి అని చెప్పారు. ప్రముఖ విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి ఉద్యమ నేపథ్యం లో ఇనాక్ సాహితీ సృజన ఉందని అన్నారు. ఆయన సాహిత్యం స్వతంత్ర భారతీయ ఆత్మను ప్రతిబింబిస్తుందన్నారు. దళిత వాదం కన్నా మానవీయ చైతన్యం కాలం భావ జాలాన్ని గ్రహించడం ఇనాక్ సాహిత్య నేపథ్యం అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై నాట్య గురువు రేణుకా ప్రభాకర్, కిన్నెర రఘురాం, గంధం అరుణ, ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొన్నారు



కొలకలూరి ఇనాక్ సాహిత్యం బహుముఖ తత్వం వ్యాస సంపుటి ఆవిష్కరించిన దృశ్యం

## సాయిబాబా ఆలయం వద్ద గోశాల ఏర్పాటుకు సహకరిస్తా

**- మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి**

**నార్సింగి, జూలై 3 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ హైదర్షాకోట్ రఘురాంనగర్ కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో గోశాల నిర్మాణంకు నావంతు పూర్తి సహకారం అందిస్తానని మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయిబాబా ఆలయంలో కాంగ్రెస్ నాయకులు టింకురెడ్డి, నర్సింగ్‌రావ్, కాలనీ వాసులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని తెలిపారు. ఆలయాల వద్ద ఉన్న ధ్వజస్థంభం, గర్భగుడి పైనున్న శిఖరాలు అంతరిక్షంలోని శక్తిని గ్రహించి ఆలయం లోపల, ఆవరణలో నిక్షిప్తం చేస్తాయన్నారు. దీని కారణంగానే ఆలయాలకు వెళ్లే భక్తులకు శారీరక, మానసిక అలసట తీరి, ప్రశాంతత లభిస్తుందన్నారు. సనాతర ధర్మంను ఆచరించే ప్రతీ ఒక్కరూ తమ బిడ్డలను విధిగా ఆలయాలకు తీసుకెళ్లాలని, మన ధర్మంను మనం భక్తిశ్రద్దలతో ఆచరిస్తూ, ఇతరుల మతాలను గౌరవించాలని సూచించారు. ఈ లోకంలో సర్వేజనః సుఖినోభవంతు అని కోరుకునేది సనాతన ధర్మంను ఆచరించే వారు మాత్రమే అన్నారు. మన ఆరోగ్య పరిరక్షణ కోసం, ఆధ్యాత్మిక వికాసానికి, ప్రకృతి పరిరక్షణకు మన మహర్షులు అనేక సదాచారాలు, పద్ధతులు పెట్టారన్నారు. గోవులో ముక్కోటి దేవతలుంటారని, గోవును నిత్యం పూజించి ఏ పని చేసినా దిగ్విజయంగా పూర్తవుతుందని, గోవు పేడ,మూత్రంతో సేంద్రీయ ఎరువులు తయారు చేసి పండించిన ఆహార ధాన్యాలను తీసుకుంటే సకల రోగాలు దూరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



హైదర్షాకోట్ రఘురాంనగర్ కాలనీలో సాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డి.

## ఆగస్టు 21న 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ 'అవార్డులు

**హైదరాబాద్,జూలై 3,ప్రభాతవార్త:**
హైదరాబాద్ అభివృద్ధికి పాలుపంచుకొంటూ రియల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తున్నసామాన్యులకు ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ అవార్డ్స్ 2025 అందిస్తున్నట్లు గుర్తింపు ఫౌండేషన్ వ్యవస్థాపకులు కొప్పుల వసుంధర తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించి మీడియాతో మాట్లాడుతూ తమ అవార్డులు తీసుకున్న వారికి ఉచిత బ్రాండింగ్, మార్కెటింగ్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గుర్తింపు ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఇప్పటికే ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించినట్టు చెప్పారు. విద్యార్థుల స్టార్టప్ వివిధ అంశాలలో ఆప్ స్కిల్, ఇంకుటేషన్, ప్రభుత్వం తరపున ఫండింగ్ సపోర్టు అందిస్తామని తెలిపారు. 18-30 ఏళ్ల వయసున్న స్టూడెంట్స్, ఇన్నోవేటర్స్, స్టార్టప్ కాంపిటీషన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 27లోపు ప్రైడ్ అఫ్ హైదరాబాద్ అవార్డు నామినేషన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని ఆగస్టు 21న జరిగే ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ఈవెంట్లో విజేతలకు రూ.లక్ష బహుమతుల ప్రదానం చేస్తామని తెలిపారు. సమావేశంలో ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు సిమి ప్రణీత, నవీన్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వసుంధర, సిమి,ప్రణీత, నవీన్, శ్రవణ్ తదితరులు

## బుద్వేల్ రైల్వే స్టేషన్‌లో అండర్‌పాస్ నిర్మించాలి

**-దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ ఉదయనాథ్‌ను కలిసిన బిజెపి నేతలు**
**-ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సిఫారసు లేఖ అందజేత**

**అత్తాపూర్ జూలై 3, ప్రభాతవార్త :**
బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రజలకు రాకపోకలు సాగించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేదా అండర్ పాస్ అయిన నిర్మించాలని పలువురు బిజెపి నేతలు డిమాండ్ చేశారు.రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రజల సమస్యను పలువురు బిజెపి నేతలు చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వివరించడంతో ఆయన స్పందించి బిజెపి తరపున లేఖ రాసి ఇచ్చారు. గురువారం దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ ఉదయనాథ్‌ను చేవెళ్ల బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో కలిసి లేఖను సమర్పించారు.ఈ సందర్భంగా బుద్వేల్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేదా అండర్ పాస్ నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఎలాంటి సదుపాయాలు లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలు సార్లు రైలు ప్రమాదంలో పలువురు చనిపోయారని కావున అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి లేదా అండర్ పాస్ నిర్మించాలని కోరారు. నేతాజీ నగర్ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ, వేంకటేశ్వర కాలనీ వంటి పరిసర ప్రాంతాల నుండి అనేక మంది ప్రయాణికులు ,విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఉద్యోగాలు, స్కూల్, కాలేజీలకు వెళ్లాలన్నా రైల్వే స్టేషన్ నుండి వెళ్లాల్సిందే కావున ప్రస్తుతం బ్రిడ్జ్ లేకపోవడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు సుమారు 4 కిలోమీటర్ల మేర అదనంగా నడవాల్సిన వస్తుందని వాపోయారు. అనంతరం స్పందించిన దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ ఉదయనాథ్ మాట్లాడుతూ...సమస్య పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని త్వరలోనే అండర్‌పాస్ లేదా బ్రిడ్జి నిర్మించే విధంగా చూస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ , రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెల్లుట్ల జగన్,చేవెళ్ల బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ సోల్కర్ రెడ్డి , జిల్లా కౌన్సిల్ సభ్యులు సబాదా విజయ్ కుమార్ ,రాజు, రామారావు ,చంద్రశేఖర్ , శంకర్ , కిట్టు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఏడాది ఏకలవ్యుడి జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలి

**సైఫాబాద్, జులై 3 ప్రభాతవార్త:** ప్రపంచంలో అత్యంత విలువైనది గురు, శిష్యుల బంధమని, నాటి కాలంలో తెలియజేసిన మహానుభావుడు ఏకలవ్యుడని ఈయన జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి డిమాండ్ చేసింది. మహాభారతంలో ఏకలవ్యుడు గురుభక్తిని చాటి ఔన్యత్వంను తెలియజేశారని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెమసారం తిరుపతి చెప్పారు. ప్రజా సమితి ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఏకలవ్యుడి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు లక్షల మంది జనాభా కలిగిన ఎరుకల జాతి ఉందని, రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రతి ఏడాది ప్రభుత్వం ఆయన జయంతిని నిర్వహించాలన్నారు. ప్రతి ఏడాది తొలి ఏకాదశిమికి 5 రోజుల ముందు తమ సమితి ఏకలవ్యుడి జయంతిని నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. అలాగే ట్యాంక్‌బండ్‌పైన ఏకలవ్యుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, 33 జిల్లాల్లో కూడా విగ్రహాలను ఏర్పాటు చేసి జయంతి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో చేర్చిన విధంగా ఏకలవ్య కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు దుగ్యాల ఉపేందర్, అంజయ్య, శ్రీనివాస్, తిరుపతి సంపత్, కుమారస్వామి పాల్గొన్నారు.



ఏకలవ్యుడి చిత్రపటానికి నమస్కారాలు తెలియజేస్తున్న ప్రజా సమితి నాయకులు

## బిసి రిజర్వేషన్లపై తక్షణమే జీవో జారీ చేయాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూన్ 30 ప్రభాతవార్త**
హైకోర్టు ఇచ్చిన గడువుకు ముందే బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని బిసి భవన్‌లో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై తక్షణమే జీవో జారీ చేయాలన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 243/డి ప్రకారం రాష్ట్రానికి పూర్తి అధికారం ఉందని, 42 శాతం రిజర్వేషన్ల సాధించే వరకు పోరాటం ఆగదన్నారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దరఖాస్తు చేసుకున్న ప్రతి బిసి విద్యార్థికి గురుకులాల్లో అడ్మిషన్లు కల్పించాలని, అదనంగా గురుకులాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతను సమాయత్తం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ జన్మదినం సందర్భంగా ఆర్.కృష్ణయ్య ఆయన్ను సత్కరించి అభినందించారు.



బిసి విద్యార్థి సమావేశంలో పాల్గొన్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు

## కనకదుర్గ దేవాలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి తొట్టెలకు పూజలు చేసిన బిజెపి నాయకులు గోవింద్‌రాఠి

**బేగంబజార్, జూలై3 ప్రభాతవార్త:**
బోనాలు ఉత్సవాలను పురస్కరించుకుని పాతనగరంలోని పురానాపూల్ స్వామి వివేకనందనగర్ కనకదుర్గ దేవాలయంలో అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రతియేటా మాదిరిగానే ఈ యేడు కూడా కనకదుర్గ ఆలయంలో అభిషేకాలు, కుంకమార్చన ప్రత్యేక పూజలతోపాటు రేణుక ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించారు.అనంతరం అమ్మవారి తొట్టెలను బ్యాండు మేళాల మధ్య యువకుల ఆటపాటలు, పోతరాజు మధ్య నృత్యాలు చేశారు.ఆలయంనుంచి బయలు దేరిన అమ్మవారిని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు.భక్తులు హారుతులు ఇచ్చి కొబ్బరి కాయలు కొట్టి పూజలను చేశారు. అమ్మవారి తొట్టెలకు బిజెపి నాయకులు గోవింద్‌రాఠి,బిఆర్ఎస్ నాయకులు ముత్యాల గోవింద్‌రాజు,సంఘం అధ్యక్షులు ఎంపి. సదానంద్,సంఘ సేవకులు ఎంపి.భీష్మా తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.స్కైహి టీమ్ ప్రతినిధులు కొన్నింటి సుధాకర్, పి. కిరణ్‌కుమార్,ఎం.సతీషన,మిర్చి,పి.భరత్‌సాయి, విద్యాసాగర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి : కార్పొరేటర్



ఆలయాల వద్ద పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**పురానాపూల్, జూలై 3ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని పురానాపూల్ డివిజన్ పరిధిలోని అలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నంరాజ్ మోహన్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని చిన్నబజార్,రత్నాబాయి గల్లీ,ఎస్.వినగర్, చంద్రిక పురం తదితర ప్రాంతాలల్లో ఆయా విభాగాల అధికారులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడం తోపాటు బోనాల పండుగ సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.అదే విద్యుత్ దీపాలు,ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంబాలను తొలగించి దూరంగా ఏర్పాటు చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### రూ.75 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జులై 3 ప్రభాతవార్త :** నాచారం డివిజన్లో రూ.75 లక్షల రూపాయల సిమెంటు రోడ్డు పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. సావర్కర్ నగర్ రోడ్ నెంబర్ మూడు లో ఎరుకల బస్తీలో మరియు శ్రీరామ్ నగర్‌లో, వీఎస్టీ కాలనీలలో నూతన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నాచారం డివిజన్ ను నెంబర్ వన్ డివిజన్ గా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని చెప్పారు. తొందరలోనే పటేల్ కుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభిస్తామని అలాగే రాబోయే రోజుల్లో చెరువులోకి మురుగునీరు రాకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ. బాలకృష్ణ ఎఈ. వినీత్,వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్, బారాసా నాయకులు కార్యకర్తలు సావర్కర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎరుకల బస్తి వాసులు శ్రీరామ్ నగర్ కాలనీవాసులు, విఎస్టి నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రంగారెడ్డి జిల్లా బీసీ మోర్చా కార్యదర్శి నెల్లుట్ల జగన్

## పిసిసి ప్రధాన కార్యదర్శులకు సన్మానం



పిసిసి ప్రధాన కార్యదర్శులు వట్టికూటి రామారావుగౌడ్, మాద సత్యంగౌడ్‌లను సన్మానిస్తున్న బాలగౌని బాల్‌రాజుగౌడ్,అయిలి వెంకన్న గౌడ్ తదితరులు

**హైదరాబాద్,జూలై 3 ప్రభాతవార్త**
పిసిసి ప్రధాన కార్యదర్శులుగా ఇటీవల నియమితులైన గౌడ నేతలను గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఘనంగా సన్మానించింది. గురువారం చిక్కడపల్లిలోని కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ కార్యాలయంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు జైగౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావుగౌడ్, మాద సత్యంగౌడ్‌లను ఘనంగా సన్మానించి అభినందించారు. గౌడ కలుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజు గౌడ్,రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్,వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్ గౌడ్ ,గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ ,బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎస్ దుర్గయ్య గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్య క్షులు సింగం నాగేశ్వర్ గౌడ్ ,బాలగౌని వెంకటేష్‌గౌడ్, పోతగాని ఐలెన్ గౌడ్ తదితరులు రామారావుగౌడ్, సత్యంగౌడ్‌లను సత్కరించారు.

### సేఫ్టీ పరికరాలను వినియోగించాలి : ఎస్ఈ వెంకన్న



సేఫ్టీ పరికరాలను అందవేస్తున్న ఎస్ఇ వెంకన్న

**హైదరాబాద్, జులై 3, ప్రభాతవార్త:**
విద్యుత్ ప్రమాదాల బారిన పడుకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ఇ పి. వెంకన్న అన్నారు. మెహిదిపట్నం డివిజన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని సిబ్బంది కి విద్యుత్ సేఫ్టీ పరికరాలను ఆయన అందచేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రత పరికరాలు తప్పనిసరిగా వినియోగిస్తే ప్రమాదాలు జరగవన్నారు.

## పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి




కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్,నాయకులు

**చార్మినార్,జూలై 3 ప్రభాతవార్త :** పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు.బహదూర్‌పుర నియోజకవర్గానికి చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల నాలుగువ తేదీన ఎల్‌బి స్టేడియంలో జరగనున్న బహిరంగ సభకు బ్లాకు అధ్యక్షులు,డివిజన్ అధ్యక్షులు,జిల్లా స్థాయి నాయకులు,అనుబంధ సంస్థల కార్యకర్తలు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్,సయ్యద్ ఇక్బాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఆహ్వానపత్రిక అందజేత



**చార్మినార్,జూలై 3 ప్రభాతవార్త :** చారిత్రాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ ఆలయంలో ఈ నెల 20వ తేదీన జరగనున్న బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడును కలిసి కమిటి ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు.కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ బి.మారుతి యాదవ్,మాజీ చైర్మన్ కె.వెంకటేష్,కోశాధికారి ఎ.చంద్రకుమార్,సాంస్కృతిక కార్యదర్శి ఎ.వినోద్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అన్నదానం శ్రేష్టమైనది

### లయన్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి



**కడ్తాల్, జూలై3, ప్రభాత వార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బాలాజీ నగర్ సభ్యురాలు హరితారెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా, కడ్తాల్ బస్టాండ్ వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా మాజీ గవర్నర్ లయన్ జి చెన్న కిషన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లా గవర్నర్ డాక్టర్ జి మహేంద్ర కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా వచ్చారు అన్నదాన అనంతరం గవర్నర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సేవా కార్యక్రమాలు అన్ని రెండు గ్లోబల్ కాజెస్లో చేయాలని నిర్ణయం తీసుకున్నామని, అవి ఒకటి హంగర్ రిలీఫ్ 2 డయాబెటిస్. ఈరోజు ఈ క్లబ్ అన్నదాన కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందని, అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నాన్ని మించిన శ్రేష్టమైన దానం ఏది లేదని, ఆకలితో అలమటించే వారికి పట్టెడన్నం పెట్టడమే గొప్ప మానవ ధర్మం అని చెప్పారు. ఈ సంవత్సరం ఎక్కువగా ఈ మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపడతామని చెప్పారు.

పి డి జి చెన్న కిషన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలు చేయడానికి ఆమనగల్ క్లబ్బు మరియు వారు స్పాన్సర్ చేసిన ఇతర క్లబ్బులన్నీ కూడా ఎప్పుడు ముందుంటాయని ఇట్టి సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. 450 మందికి అన్నదానం చేశారు . జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య జోన్ చైర్మన్ జూలూరు లింగయ్య క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి గంప శ్రీనివాస్ , ఇతర సభ్యులు కండె ఓంకారం జూలూరు రమేష్ వీరబొమ్మ బిక్షపతి కే రామ్ రెడ్డి చేగురి వెంకటేష్, పి ఆర్ ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్



**కడ్తాల్, జూలై 3, ప్రభాత వార్త :** రాష్ట్రంలో గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, పీసీసీ సభ్యుడు, గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిల్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో, గీత కార్మికుడు శేషయ్యగౌడ్ పెంచుతున్న ఈత వనాన్ని సీఐ బద్యానాథ్ చౌహాన్తో కలిసి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సంక్షేమంతో పాటు, అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని పేర్కొన్నారు. గీత కార్మికులు కల్లు గీసే సమయంలో ప్రమాదాల బారిన పడకూడదనే ఉద్దేశ్యంతో, కాటమయ్య రక్షణ కవచం పేరిట సేఫ్టీ మోకులను అందిస్తోందని గుర్తు చేశారు. గీత వృత్తిని పోత్సహించేందుకు ఈత మొక్కలను పెంచేందుకు ఉచితంగా ఎక్సైజ్ శాఖ ద్వార అందిస్తుందనితెలిపారు. గీత కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న ఈత చెట్లను తమతమ పోలాల్లో, చెరువు కట్టలపై నాటుకోవాలని సూచించారు. అదే విధంగా గీతకార్మికులకు లైసెన్సులు లేని వారు అప్లై చేసుకుంటే గీత కార్మికులకు లైసెన్స్ లు కూడ అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను గీత కార్మికులు, గౌడ కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాదారం యాదగిరి గౌడ్, బాలయ్య గౌడ్, నరేష్ గౌడ్, నర్సింహ గౌడ్, శ్రీరాములు గౌడ్ వెంకటేష్ గౌడ్, సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు .

### శిథిలావస్థలో సీతాఫల్ మండి ప్రభుత్వ ఆసుపత్రి

**కంటోన్మెంట్, జూలై 3 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మెట్టుగూడలోని రైల్వే ఆసుపత్రి ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న 3 అతి పెద్ద ఆర్టీసి క్వార్టర్ స్ లో 450,452 పూర్తిగా శిథిలావస్థలో చేరుకోవడంతో సంఘ విద్రోహ శక్తులకు, తాగుబోతులకు అడ్డాగా మారాయి. 451 క్వార్టర్ స్ లో సీతాఫల్ మండి పేరుతో కొనసాగుతున్న అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గత 2 సంవత్సరాల నుంచి కొనసాగుతుంది. సీతాఫల్ మండిలో ఉండాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిని మెట్టుగూడ రైల్వే ఆసుపత్రి వద్ద ఉన్న ఆర్టీసి క్వార్టర్లో కొనసాగడంతో ఆ ప్రాంత ప్రజలు వెళ్లలేక పోతున్నారు. దీంతో రోగుల సంఖ్య పూర్తిగా తగ్గింది.

సీతాఫల్ మండి ప్రాంతంలోని యూసిహెచ్సి ఆసుపత్రి నిర్మాణంలో ఉన్నందు వల్ల ఇక్కడికి బాధిలీ చేశారు. సీతాఫల్ మండి ప్రాంతవాసులకు సికింద్రాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రాంగణంలో కొనసాగుతున్న సెట్విన్ భవనంలోకి మారిస్తే రోగులకు ఉపయోగకరంగా ఉండేదని స్థానికులు వ్యక్తం చేశారు. 451 ఆర్టీసి క్వార్టర్ను యూసిహెచ్సి ఆసుపత్రి వినియోగించుకున్నందుకు ఆర్టీసికి నెలకు రూ.52 వేలు చెల్లిస్తున్నామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ తెలిపారు.

## రౌడీషీటర్ అన్నందుకు హత్య

### ముగ్గురు నిందితులు అరెస్ట్

హైదరాబాద్, జులై3, ప్రభాతవార్త: రౌడీషీటర్గా పిలిపించుకునేందుకు ఓ రౌడీషీటర్ అనుచరులే దారుణ హత్యకు ఒడిగట్టాడు. కూకట్పల్లి పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోరబండలో పేరు మోసిన రౌడీ షీటర్ కొడుకు సయ్యద్ షాహిద్ (26) సైతం ఆ ప్రాంతంలో తన తండ్రి స్థానాన్ని భర్తీ చేస్తూ రౌడీ షీటర్గా కొనసాగుతున్నాడు. షాహిద్ ను అడ్డు తొలగించి ఆ స్థానంలో తాము నిలవాలని అతని స్నేహితులు ఎండి సాజిద్ (24), ఎండి సమీర్ ఖాన్ (25), వై.హనాక్ (25) అలియాస్ మున్నా లు పన్నాగం పన్నారు. పథకం ప్రకారం గత నెల 29వ తేదీన పవన్ అనే స్నేహితుడి జన్మదిన వేడుకలకు కూకట్పల్లి ప్రకాష్ నగర్ లోని ఓ నిర్మానుష్య ప్రదేశంలో హాజరైన షాహిద్, సాజిద్, మున్నాలు మద్యం సేవించాక.. మత్తులోకి వెళ్లిన షాహిద్ పై సాజిద్, మున్నాలు ముందుగా బీర్ బాటిల్ తో మెడ పై పొడిచి, తరువాత బండ తలతో బాది హత్య చేశారు. ఆ తర్వాత సంఘటన స్థలం నుండి పరారయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

## అలరించిన శ్రీరామ్ సుస్వరాలు

**చిక్కడపల్లి, జూలై 3 ప్రభాతవార్త:** శ్రీరామ్ సుస్వరాలు(మ్యూజికల్ అకాడమి) ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని మారుతీ కళావేదిక ఆవరణలో పాటల విభవరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ గాయకుడు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు హాజరై అద్భుతంగా గానం చేసిన గాయనీ గాయకులను సత్కరించి అభినందించారు. స్వరబ్రహ్మ డాక్టర్ మూర్తి శ్రీరామ్, డాక్టర్ వెంపటి జోస్యుల నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో గాయనీ మల్లాది ఉష, ఫ్లారెన్స్, డాక్టర్ వెంపటి జోస్యులు, సావిత్రి ప్రభాకర్, పి.పద్మావతి, శ్రీదేవి, శారద, సులక్షణ, జి.లక్ష్మి, విజయలక్ష్మి, స్వప్న, నందగోపాల్, నాగేశ్వర్ప్రసాద్, జి.వెంకటరావు, డాక్టర్ మల్లికార్జున్, ఉమాపతి, భరద్వాజ్, సోమయాజులు, డాక్టర్ కె.అర్చనఅద్భుతంగా గానం చేశారు.

# ప్రభుత్వ పథకాలు అమలులో ప్రగతి సాధించాలి

-సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
-చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య అదేశం



కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూలై 3, ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలు అమలులో ప్రగతి సాధించేందుకు అధికారులు కృషి చేయాలని చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య అదేశించారు. గురువారం చేవెళ్ల ఏమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ డిఎఓ,ఎమ్మార్వో, ఎంపిడిఓ, వ్యవసాయ శాఖ ఎడి, ఇతర ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించార. ఈ సందర్భంగా చేవెళ్ళ ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని శాఖ ల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పథకాలు ప్రజలు చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రుణమాఫీ ఎంత మంది రైతులకు జరిగిందని, రుణమాఫీ జరగని రైతులు ఇంకా ఎంత మంది ఉన్నారని, రైతు బందు పథకం ఎంత మందికి వచ్చిందన్నారు. ప్రభుత్వం తరపున ఉచితంగా పంపిణీ చేసే విత్తనాలను రైతులకు చేరవేయాలని, రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలేత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో భూభారతి రెవెన్యూ చట్టంపై జరిగిన అవగాహన సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తులను పెండింగ్లో ఉండకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్దిదారులు ప్రతి ఒక్కరు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి విదతలో ఇందిరమ్మ ఇల్లు రాని వారికి రెండవ విడతలో మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపిడిఓ హిమబిందు, చేవెళ్ల తహసీల్దార్ క్రిష్ణా, నవాబ్పేట్ తహసీల్దార్ బుచ్చన్న, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బడి పిల్లలకు దాతలసహకారం అభినందనీయం..

### -విద్యావంతుల వేదిక రాష్ట్రష కార్యదర్శి రవీందర్ గౌడ్



**దుద్యాల్, జులై 3, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు వివిధ సంస్థల నుంచి దాతలు ముందుకు వచ్చి బోధన, అభ్యాసన సామాగ్రిని ఉచితంగా అందజేయడం ఎంతో అభినందనీయమని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నాజ్ ఖాన్ పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పలకలు పంపిణీ చేశారు. రవీందర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందించే సౌకర్యాలతో పాటు దాతలు అందించే సహకారం ఎంతో అభినందనీయమన్నారు. వందేమాతరం ఫౌండేషన్, బాల భీమా న్యూస్ ఛానల్, మా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులకు ఉచితంగా పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, నందిని నాయకులు సాయిలు, సురేందర్ రెడ్డి, సకనప్ప, వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాణిగంజ్ డిపోలో

### 17నజ్యోతిరావ్పూలే విగ్రహ ఆవిష్కరణ

**కంటోన్మెంట్, జూలై 3 ప్రభాతవార్త:** ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రాణిగంజ్ డిపో అవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయ్ పూలే విగ్రహాల ఆవిష్కరణకు హాజరు కావాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ను ఆర్టీసి బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

గురువారం వెస్ట్ మారేడ్పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసి గ్రేటర్ జోన్ బీసీ సంఘం గౌరవ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఇ.నిరంజన్, జోనల్ కార్యదర్శి వెంకట్ ముదిరాజ్, సంపత్లు కలిసి ఆహ్వాన పత్రిను అందజేశారు.

ఈ సందర్భంగా ఆర్టీసి బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ మాటా్లడుతూ తన తండ్రి గుర్రం నర్సయ్య గౌడ్, రాణిగంజ్ డిపోలో ఆర్టీసి డ్రైవర్గా పనిచేశారని, ఆయన జ్ఞాపకార్ధం ఈ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తలసానికి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రేమ పేరుతో ముగ్గురు పిల్లల తండ్రి మోసం... యువతి ఆత్మహత్య

**నాచారం, జులై 3 ప్రభాతవార్త :** ప్రేమ పేరుతో అమ్మాయిని నమ్మించి మోసం చేయడంతో కలత చెంది అమ్మాయి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. నాచారం ఎర్రకుంట ప్రాంతానికి చెందిన దాసరి మహెందర్ వృత్తి రిత్యా కూలి పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇదిలా ఉండగా గంజాయికి అలవాటు పడిన మహెందర్ ఇటీవల స్థానికంగా ఉండే (19) సంవత్సరాల యువతితో ప్రేమ వ్యవహారాన్ని నడిపించాడు.

తాను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను శారీరకంగా వాడు కుంటున్నాడు. ఈ క్రమంలో ఆమె గర్భవతి అయ్యింది. తనను పెళ్లి చేసుకోవాలని అతనిని ఆమె వేడుకున్నప్పటికి పెళ్లి ను చేసుకునేందుకు అతను నిరాకరించాడు. ఈ క్రమంలో తాను మోస పోయానని గ్రహించిన ఆమె తీవ్ర కలత చెంది గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు మహెందర్ను అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమీషన్ను వేయ్యాలి

### -జస్టిస్ చంద్రకుమార్



ప్రసంగిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

**చిక్కడపల్లి జూలై 3 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేకంగా ఒక కమీషన్ ను వేయ్యాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈసందర్భంగాచంద్రకుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనలో జరిగిన ఉద్యమంలో ఎవరెవరు పాల్గొంది, చనిపోయినవారి కుటుంబాలు, జైలుకు వెళ్ళిన వారి వివరాలను సేకరించి 3 నెలలోపు ఉద్యమ కారుల లిస్టు తయారు చేసి ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏ ఆకాంక్షతో రాష్ట్రం ఏర్పడిందో దాన్ని గుర్తించి ఉద్యమకారులను గౌరవించాలన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే అదే తరహాలో ప్రభుత్వానికి ఉద్యమకారులు నిరసన తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఎమ్మెల్సీ కొదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు విమలక్క, కె. గోవర్ధన్, జి. ఝాన్సీ, ప్రపుల్ రామిరెడ్డి, మన్నారం నాగరాజు, ఆనందం, కుమార స్వామి, మోహన్ బైరాగి, గొల్లపల్లి దయానంద్, చంద్రన్న ప్రసాద్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళనం



-ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్కుమార్యాదవ్

**చిక్కడపల్లి, జూలై 3 ప్రభాతవార్త:** ఎల్పి. స్టేడియంలో టిపిసిసి ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళనం సభను జయప్రదం చేయాలని రాజ్యసభ సభ్యుడు ఎం.అనీల్కుమార్యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం గాంధీనగర్ డివిజన్లోని జవహర్నగర్ కమ్యునిటీ హాల్లో నియోజకవర్గం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. సమ్మేళనం సభకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే హాజరవుతారని, 'జైబాపూ, జైబీమ్ కార్యక్రమానికి సంబంధించి గ్రామ కమిటీల అధ్యక్షులకు దిశానిర్దేశం చేస్తారని అన్నారు. వేల సంఖ్యలో నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల నుంచి కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తరలిరావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు పాశం అనీల్కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వాజీద్హుస్సేన్, ముషీరాబాద్ బ్లాక్ అధ్యక్షుడు వీ.డి.కృష్ణ, అంజియాదవ్, లక్ష్మీగణపతి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగరావు, సాయికీర్త్(బాబ్జీ), అభిషేక్కెన్నడి, భాస్కర్, శీలం సత్యనారాయణ, డిహెచ్.మధుమతి, జి.జయేందర్బాబు, గుండు జగదీశ్బాబు, కెన్నడీ కృష్ణారావు, పెండెం శ్రీనివాస్యాదవ్, నర్సింగ్మూది రాజ్, సికింద్రాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ వెంకటస్వామి, వెంకటేశ్, పుస్తకాల కవిత, మేడి సురేశ్; సురేశ్యాదవ్, ఆవుల లోకేష్యాదవ్, బంటారం యాదగిరిగౌడ్, నరేందర్యాదవ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలే ఉన్నత విజయాలకు నిలయాలు

**దౌల్తాబాద్, జులై 03, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారంరోజు విద్యార్తులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. వికారాబాద్ జిల్లా నోడల్ అధికారి శ్రీ శంకర్నాయక్ అధ్యక్షతన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్నాయక్ మాట్లాడుతూ... కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమయ్యే అన్ని వసతులను కల్పించడానికి తాను సిద్దంగా ఉన్నానని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు. ఇప్పటికే 12 మంది అధ్యాపకులను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటుగా, ఆటపాటల్లో కూడా శిక్షణ ఇవ్వాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ డిగ్రీ కళాశాలల సంయుక్త కార్యదర్శి జెడి డా.రాజేందర్సింగ్ మాట్లాడుతూ ..ప్రభుత్వ కళాశాలలే ఉన్నత విజయాలకు నిలయాలని, ప్రభుత్వ కళాశాలలో చదివే మీరు ఉన్నత విజయాలను సాధించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలన ఉంటే సాధించలేనిది లేదని, ఉన్నతమైన భవిష్యత్తుకు చదువే బలమైన ఆయుధమని పేర్కొన్నారు .ప్రభుత్వం దౌల్తాబాద్ మండలంలో జూనియర్ కళాశాల మంజూరు చేసి, అనుభవజ్ఞులైన 12 మంది అధ్యాపకులను నియమించడం ఈ మండలానికిఅదృష్టమన్నారు. కావునస్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించవలసిందిగా సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు సంబంధించి ఇంగ్లీష్, తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు, కళాశాలకు అవసరమైనప్పుడు తనవంతు సహాయం అందిస్తానన్నారు తెలంగాణ డిగ్రీ కళాశాలల సంయుక్త కర్యదర్శి డా.రాజేందర్సింగ్, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాదికారి శంకర్నాయక్, దౌల్తాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరిరెడ్డి, రిటైర్డ్ ఏంఈఓ బాబుసింగ్, రిటైర్డ్ హెడ్మాస్టర్ ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జులై 7 న ఎమ్మార్పీఎస్ జెండాల ఆవిష్కరణ



**చౌడాపూర్ జులై 3, ప్రభాతవార్త :**

జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర కార్యదర్శి గట్టగల్ల ప్రశాంత్ మాదిగ తెలిపారు. మండల ఇన్చార్జి గజ్జల ప్రవీణ్ మాదిగ, చౌడాపూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మొగులయ్య మాదిగ అధ్యక్షతన మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమంలో మండల అంబేద్కర్ సంఘాల అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి కుమార్ , గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, మొగులయ్య , గోవర్ధన్ , మందిపాల్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు శివకుమార్ , యాదయ్య, అనంతయ్య ,తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎంపీడీవో రాధారాణి

యాచారం జులై 3 ప్రభాతవార్త : యాచారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవో రాధారాణి వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్య, వైద్య, ఉపాధి, నర్సరీ, ఇందిరమ్మ ఇల్లు, అన్ని శాఖల అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. విధినిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ శ్రీలత, ఉపాధి హామీ ఇంజనీర్ శివశంకర్, వైద్యాధికారులు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు రూ.2లక్షల బీమా అందజేత



**యాచారం జులై 3 ప్రభాతవార్త..** ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పతాకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కళ్యాణ్ తెలిపారు. యాచారం మండల పరిధిలోని మల్కీస్ గూడ గ్రామానికి చెంది నరెడ్డమోని వెంకటేష్ అనే వ్యక్తి యాచారం లో పాస్ట్ ఫుడ్ సెంటర్ నడిపించేవాడు. అతను ఇటీవల గుండె పోటు తో మరణించాడు. ఆయన తెలంగాణ గ్రామీణ బ్యాంకు యాచారం శాఖ లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద 436/ ఇన్సూరెన్స్ చెల్లించాడు. గత నెల క్రితం అనారోగ్యంతో ఇన్సూరెన్స్ డబ్బులు నామిని అయినా ఆయన యొక్క భార్య పద్మ కి బీమా డబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ అందరు ఈ యొక్క బీమా అందరు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ప్రీమియం చెల్లింపుకే రెండు లక్షల బీమా ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోస్ట్ ఆఫీస్, ఎల్ఐసి, ప్రవేట్ సంస్థల బీమా ప్రీమియం కంటే చాలా తక్కువ ధరలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



**తలకొండపల్లి జూలై 3,** ప్రభాతవాత్తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ గ్రామానికి చెందిన కల్వకోలు లక్ష్మయ్య అనే వ్యక్తి అనారోగ్యానికి గురై బుధవారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మయ్య గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వ్యక్తిగతంగా మూడు వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మలికేడి అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ , మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండి హరిఫు, నాయకులు కృష్ణయ్య మల్లేష్ లక్ష్మణ్ స్వామి రమేష్ గోపాల్ శ్రీశైలం ఆంజనేయులు నాయకులు కృష్ణయ్య మల్లేష్ లక్ష్మణ్ స్వామి రమేష్ గోపాల్ శ్రీశైలం ఆంజనేయులు తదితరులు ఉన్నారు

## సిఎం సహాయ నిధి పేదలకు వరం..



**దుద్యాల్, జులై 3, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఈర్లపల్లి లో అ ుబంధ గ్రామమైన సంత్రకుంట తండా వాసులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రవి నాయక్ పంపిణీ చేశారు. రాథోడ్ రాధా బాయి కు రూ.50,000, రాథోడ్ సురేష్ కు రూ.29,000 చెక్కుల ు నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి ఆదేశా నుసారం పంపిణీ చేసినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఆర్థిక స్తోమత లేని బాధితుల వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాహుల్, మొగులయ్య, సోని దాస్ తదితరులు పాల్గొన్నారు.

### వి.జి.ఎఫ్ జీవన సాఫల్య జాతీయ పురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, జూలై 3 ప్రభాతవార్త:** కవులు తమ రచనల ద్వారా విశ్వప్రేమ తత్వాన్ని ప్రజలకు ప్రబోధించాలని విశ్రాంత ఆదాయపుపన్ను శాఖ కమీషనర్, ప్రముఖఆధ్యాత్మికవేత్తయం.నరసింహప్ప పేర్కొన్నారు. గురువారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్భారతీయసాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖకవిడా.బిక్కికృష్ణఅధ్యక్షతన జరిగిన ఫౌండేషన్ వార్షి కోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వి.జి.ఎఫ్ అధ్యక్షురాలుడా.పి. విజయలక్ష్మిపండిట్ వి.జి.ఎఫ్ ఫౌండేషన్ద్వారా చేస్తున్న సేవల అద్భుతమని కొనియాడారు. సభాధ్యకులు డా.బిక్కి కృష్ణ మాట్లాడుతూ వి.జి.ఎఫ్ ఫౌండేషన్ కొత్త కవులను ప్రోత్సహించడంతో పాటు వారి రచనలను వెలుగులోకి తెచ్చిందన్నారు. ఆలూరుసుబాష్బాబు (విద్యఉపాధి )భగీరథ(సాహిత్యం), సునంద బాయి(ఆధ్యాత్మిక సేవ)లకు వి.జి.ఎఫ్ జీవనసాఫల్య జాతీయపురస్కారాలుఅందజేశారు. అనవాదకురాలు డా. యశోదదేవి ,ఆధ్యాత్మిక రచయిత్రి మారేపల్లి భువనేశ్వరి రాచకొండమలి కార్జునరావులనుప్రదానంచేశారు. ఈసందర్భంగాప్రముఖకవయిత్రి రాధాకుసుమ, పద్మశ్రీలతల నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనం జరిగింది.



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఓ కుసుమ మాధురి

## స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణంపై అవగాహన

**ఆమనగల్లు, జూలై3, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం సమవేశం హాలులో గురువారం పంచాయతీశాఖ ఉద్యోగులకు అడ్వాన్స్ మెంట్ ఇండెక్స్ 2025 స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఓ కుసుమ మాధురి అధ్యక్షతన జరిగిన సమావేశానికి మండల ప్రత్యేక అధికారి శోభారాణి ముఖ్య అతిథిగా హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. మండలంలోని 13 పంచాయతీల అన్ని వర్గాల ఉద్యోగులు సమావేశంలో పాల్గొన్నారు. తొమ్మిది అంశాలపై సుధీర్ఘంగా అవగాహన కల్పించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యవంతమైన సమాజం, పారిశుద్ధ్యం, తాగునీరు సమగ్ర ఆరోగ్య సేవలు, పౌష్టికాహారం, పిల్లల స్నేహపూర్వక పంచాయతీ, నీరు తగినంత ఉన్న పంచాయతీ, స్వచ్ఛమైన పచ్చని పంచాయతీ, మౌలిక వసతులు, సామాజిక న్యాయం, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక వాతావరణం వంటి అంశాల సాధనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిఓ వినోద, ఏపిఓ మాధవరెడ్డి, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ మంజుల, అఫిసర్ తిరుపతయ్య పాల్గొన్నారు.

## పండిత పరిషత్ రాష్ట్ర నేతగా అమీర్ పాషా

**షాద్‌నగర్, జూలై 3, ప్రభాతవార్త :** ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఎం.డి.అమీర్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, టీపీఆర్‌టీయూ, టీపీసీసీ అధికార ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డిల సహకారంతో రాబోయే రోజుల్లో జీహెచ్‌ల ప్రమోషన్లకు అడ్డంకిగా ఉన్న యాక్ట్ 1/25 రద్దుక కృషి చేస్తానని అన్నారు.

## బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడికి అభినందన



రామచంద్రన్‌కు మొక్కను బహూకరిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

**షాద్‌నగర్, జూలై 3, ప్రభాతవార్త :** బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌ను తార్నాకలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపినట్లు షాద్‌నగర్ బీజేపీ నాయకుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్ భాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, పసుల నర్సింహ్మా యాదవ్, చేగు సుధాకర్, బల్వంత్ రెడ్డి, మల్‌రెడ్డి మహేందర్ రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షుడు అత్తాపురం మహేందర్ రెడ్డి, ఎదిర రాజు, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, రంగన్న గౌడ్, కర్రెల్ల నరేందర్ రెడ్డి, బోయ అశోక్, కుమ్మరి మహేష్, అనిల్‌కుమార్ గౌడ్, రాజు నాయక్, సుధీర్, గణేష్ నాయక్, భక్త వత్సల్, చౌడం శ్రీనివాస్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గే సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలి రావాలి

**కేశంపేట, జూలై 3, ప్రభాతవార్త :** ఈనెల 4న హైదరాబాదు లోని ఎల్బీ స్టేడియంలో జరిగే ఖర్గే సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కేశంపేట మండలంలో అన్ని గ్రామాల నుంచి మహిళలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని షాద్ నగర్ నియోజకవర్గం సీనియర్ మహిళా నాయకురాలు జూలపల్లి అనసూయమ్మ ముదిరాజ్ తెలిపారు.

## విలేకరి కుటుంబానికి ఆర్థిక సహాయం



చంద్రశేఖర్ భార్య లావణ్యకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

**ధారూరు, జూలై 3, ప్రభాతవార్త:** ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన విలేకరి చంద్రశేఖర్ కుటుంబానికి పత్రికా విలేకరులు, మండల నాయకులు, అధికారులు ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని కొండాపూర్‌కలాన్ గ్రామా నికి చెందిన మృతుడు చంద్రశేఖర్ భార్య లావణ్యకు రూ.87,500 చెక్కు ను గురువారం అందజేశారు. మండల నాయకులు, అధికారుల తరఫున రూ.62 వేలు, విలేకరుల తరఫున రూ.30,500 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విలేకర్లు నర్సయ్య, మల్లికార్జున్, శ్రీశైలం, కృష్ణ, అశోక్,బాలరాజు, నాయకులు బాబా ఖాన్, నారాయణరెడ్డి పాల్గొన్నారు

## రాందాస్‌గౌడ్‌ను అభినందించిన ఎస్ఐ దామోదర్

**మర్కుక్, జూలై 3 (ప్రభాతవార్త):**

గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి, 2వ తరగతి విద్యార్థులకు తన సొంత ఖర్చుతో ఇంగ్లీష్ మీడియం పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్‌ను అందజేస్తున్న వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్‌ను మర్కుక్ ఎస్ఐ దామోదర్ అభినందించారు. గురువారం మండల పరిధిలోని చేబర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బబ్బూరి రాందాస్‌గౌడ్ ముఖ్య అతిథి ఎస్ఐ దామోదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింలు చేతులమీదుగా రూ.20వేల విలువైన ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన రాందాస్‌గౌడ్ విద్యాభివృద్ధికై కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యాబోధన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ అశోక్, ఉపసర్పంచ్ స్వామి, పాఠశాల చైర్మన్ అఖిల, కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఉపాధ్యాయులు ఉమారాణి, శ్రీధర్, కమలాకర్‌రెడ్డి, స్వాతి, జ్యోతి, నాయకులు పోయిల మల్లేశం, నయీం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు..

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**జగదేవ్‌పూర్, జూలై 3 (ప్రభాతవార్త):** జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బైండ్ల సంతోష్ గత వారం రోజుల క్రితం మృతిచెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి గురువారం మృతుని కుటుంబసభ్యులు, ఎస్సీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు చిరంజీవిని గజ్వేల్ ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి పరామర్శించి రూ.24వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఏఎంసి డైరెక్టర్ సముద్రాల హరినాథ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొత్త నర్సింహారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ కొత్త లక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెష్ నాయకులు కొంపల్లి కరుణాకర్, గాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, అజీజ్, బింగి నర్సింలు, పాషా, మండల యూత్ అధ్యక్షుడు క్రాంతి, ఉపాధ్యక్షుడు వెంకటేష్, దశరథ, సురేష్, ఆంజనేయులు, వెంకటేష్, సత్యం పాల్గొన్నారు.



అప్పరెడ్డిగూడెంలో స్లాబ్ వరకు వచ్చిన ఇందిరమ్మ ఇల్లు

# ఇందిరమ్మ ఇళ్లు చక చక

**ముమ్మరంగా నిర్మాణ పనులు**

**సాకారమవనున్న సొంతింటి కల**

**నందిగామ, జూలై 3 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామంలో చక చక సాగుతు న్నాయి. ఇప్పటికే కొన్ని ఇండ్లు స్లాబ్ ముగిసి గోడలు లేచి ప్లాస్టింగ్ వరకు వచ్చింది. ఎన్నో ఏళ్ల తర్వాత తమ సొంతింటి కల సాకారం అవుతున్నందున ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులం దరూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటామంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులను వేగవంతం చేసేందుకు, లబ్ధిదారులకు ఖర్చులను తగ్గిం చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా నిర్మాణ సామాగ్రి అయిన సిమెంటు, స్టీల్, ఇటుక వంటి వాటి ధరలను మండల స్థాయిలో నిర్ణయిం చాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాగా.. ప్రస్తుతం ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కాగా, ఈ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి, సామాన్యులకు అందుబాటులో ఉండే ధరలకు నిర్మాణ సామగ్రిని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. సిమెంటు, స్టీల్, ఇటుక వంటి నిర్మాణ సామగ్రి ధరలను మండల స్థాయిలో నిర్ణయించడానికి ధరల నిర్ణయ కమిటీలు సమావేశం కావాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే.

**పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం**

**కేశంపేట, జూలై 3 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బీస కరుణాకర్ రెడ్డి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అట్టడుగు వర్గాల నిరుపేద ప్రజలకు సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని ఆయన అన్నారు. గ్రామంలో నిరుపేదలైన 14 మంది లబ్ధిదారులను గుర్తించి, వాటిలో 10 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని మిగతా నాలుగు ఇండ్లు త్వరలోనే ప్రారంభింప చేస్తామని ఆయన అన్నారు. ఇంకా ఇండ్లు లేని నిరుపేద ప్రజలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తి శేఖర్, గుత్తి చంద్రయ్య, కల్వకోలు నిరంజన్, చిట్టిరెడ్డి రాంరెడ్డి, ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, పుట్నాల మహాలింగం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నాయకులు

,లాలమోని పాండు, కానుగుల చెన్నయ్య, పోగుల నర్సింలు, బత్తిన చెన్నయ్య, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చేయి..చేయి కలిపి శ్రమైక సౌందర్యం

**ఇరిగేషన్ అధికారుల సహకారంతో రహదారికి స్వచ్ఛందంగా మరమ్మతులు**

**రంగాపూర్ గ్రామస్తుల ఆదర్శం**

**వార్త కథనానికి స్పందన**

**నందిగామ, జూలై 3, ప్రభాతవార్త :** నందిగామ మండలం రంగాపూర్ స్మశాన వాటికకు వెళ్లే రహదారి గోతుల మయమైంది. ఈ రహదారిని గ్రామస్తులంతా కలిసి గురువారం బాగు చేసుకున్నారు. రంగాపూర్ మీదుగా కొడిచర్ల వెళ్లే రహదారినీ గ్రామంలో ఉన్న స్మశాన వాటిక వద్ద ఓ రైతు తమ భూముల్లోకి వ్యర్థపు నీరు వస్తుందని రహదారిపైకి మళ్ళించారని ఈనెల 1వ శ్మశాన వాటికకు దారేది అనే శీర్షికతో వార్త దినపత్రికలో ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన ఇరిగేషన్ అధికారులు గ్రామస్తులతో కలిసి గురువారం జెసిబి సాయంతో రహదారిని బాగు చేసుకున్నారు. సమస్యను వెలుగులోకి



రంగాపూర్ నుండి కొడిచర్ల వెళ్లే రహదారిని పునరుద్ధరించుకున్న గ్రామస్తులు

తెచ్చి పరిష్కరించిన వార్త దినపత్రికకు గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## వంటశాల షెడ్డు నిర్మాణానికి హామీ

**తలకొండపల్లి జూలై 3, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రం లోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో కిచెన్ షెడ్డు లేక విద్యార్థులకు వంట చేసేందుకు వర్షానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం వర్షం రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురైన వంట పనివారు సామాజిక మాధ్యమాల్లో తెలిపారు. దీంతో స్పందించిన తలకొండపల్లి మాజీ ఉప సర్పంచ్ పద్మ అనిల్ పాఠశాలలోని విద్యార్థుల కు కిచెన్ షెడ్డు నిర్మాణానికి సొంత ఖర్చులతో పూర్తి చేస్తానని, కూలిన కిచెన్ షెడ్డు ను ఎంఈఓ చాంప్లా నాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కిచెన్ షెడ్డు మరమ్మతులను సొంత డబ్బులతో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శ్రీశైలం, శేఖర్ విజయ్ పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు నేతల పరామర్శ

**తలకొండపల్లి జూలై 3, ప్రభాతవార్త;** తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను గురువారం నాడు బిజెపి నాయకులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు టి ఆచారి పరామర్శించారు. మెదక్ పల్లి గ్రామానికి చెందిన పాలాది శ్రీకాంత్ 24 అనే యువకుడు గత వారం రోజుల క్రితం కల్వకుర్తి మండలం యంగంపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. అతిపిన్న వయసులో రోడ్డు ప్రమాదాన్ని గురై శ్రీకాంత్ మృతిచెందడంతో అతని కుటుంబ పరమర్శించి ఓదార్చారు. అనంతరం అనారోగ్యానికి గురై మృతి చెందిన బొమ్మ రాములయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తిక్కల మల్లేష్ ప్రవీణ్ గౌడ్ బోయ నరేందర్ షానమోని విష్ణు, సంతోష్ గణపురం శ్రీను సంతు ఉన్నారు.

## గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం

**యూసుఫ్‌గూడ, జూలై 3, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల(బాలురు,బాలికలు) బోరబండలో 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన ఇంగ్లీష్ మీడియంలో చదివిన విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ రమణమ్మ తెలిపారు. జూలై 4 శుక్రవారం వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు.



మధ్యాహ్న భోజన సామాగ్రి పంపిణీ చేస్తున్న మండల విద్యాధికారి సాయిరెడ్డి తదితరులు

## సర్కారు బడులపై నమ్మకం పెరిగింది

**పూడూరు, జూలై 3, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల ప్రజలకు నమ్మకం పెరిగిందని మండల విద్యాధికారి సాయిరెడ్డి పేర్కొన్నారు.గురువారం పూడూరు మండల విద్యావనరుల కేంద్రంలో వివిధ గ్రామాల పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి సంబంధిచిన సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఈ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రజలకు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం పెరిగటమే ఇందుకు కారణన్నారు.

విద్యాశాఖ పాఠశాలలు పున:ప్రారంభం ముందే ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు,నోట్ పుస్తకాల అందించిందన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పాఠశాలకు అవసరమగు అదనపు సమాచారం సేకరిస్తున్నామన్నారు. మండలం లోని ఉపాధ్యాయు లందరు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నైపుణ్యాలను తరగదులలో అందించగలరని తెలిపారు. తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహించి వారిని పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను చెయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధు, ఖజా మోహినుద్దిన్, నర్సింహారెడ్డి, సిఆర్‌పిలు గాలయ్య, మోహన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టూవీలర్ మెకానిక్‌లకు వెల్ఫేర్ బోర్డు

**అసోషియేషన్ అధ్యక్షుడు పర్వతాలు డిమాండ్**

**ఆమనగల్లు, జూలై3, ప్రభాతవార్త :** ఆమనగల్లు టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ టూవీలర్ మెకానిక్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోషియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు పర్వతాలు అధ్యక్షతన ప్రత్యేక సమావేశమయ్యారు. మెకానిక్ కార్మికుల సమస్యలపై చర్చతోపాటు పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం టూ వీలర్స్ సృష్టికర్త గాట్లేబ్ డైమండ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మెకాని క్‌లకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు



ఆమనగల్లులో ప్రపంచ టూవీలర్ మెకానిక్ దినోత్సవం జరుపుకుంటున్న కార్మికులు

మెకానిక్ కార్మికులు మాట్లాడుతూ టూ వీలర్ మెకానిక్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ బోర్డుని ఏర్పాటు చేయాలని కోరారు.

మెకానిక్‌లకు ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యం కల్పించాల న్నారు. ప్రతి టూ వీలర్ మెకానిక్‌కు కార్మికశాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. ఈసందర్భంగా పట్టణంలో ప్రత్యేక బైక్ ర్యాలీ నిర్వహించి సందడి చేశారు. ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శి వస్పూల కృష్ణ, ఉపాధ్యక్షుడు రాఘవేందర్, గౌరవ అధ్యక్షులు కొండల్, కార్యదర్శి ఏలే శ్రీను, బొడ్డుపల్లి మహేష్, బిచ్చా సింగ్, శ్రీను, క్రాంతి, విజేందర్, రాజు, శివ, జంగయ్య, వెంకటేష్, జహంగీర్, నరసింహ, శ్రీను, రవి, రాజు, లక్ష్మణ్ సింగ్, మల్లేష్, మహేష్ తదితరులు ఉన్నారు.

## మార్కెట్‌యార్డు చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

**ఆమనగల్లు, జూలై3, ప్రభాతవార్త:** ఆమనగల్లు మార్కెట్‌యార్డు ఉద్యోగులు గురువారం మధ్యాహ్నం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డు కార్యదర్శిపై మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ దాడి చేయ డాన్ని వారు ఖండిస్తూ నిరసన చేపట్టారు. టిఎన్‌జిఓఎస్ ఏఎంసి ఉద్యోగుల కేంద్ర సంఘం అధ్య క్షుడు సిహెచ్ నరసింహరెడ్డి, కార్యదర్శి ముకు రమ్ పిలుపు మేరకు నిరసన చేపట్టి నట్లు వారు తెలిపారు. భాస్కర్‌పై దాడి చేసిన వైస్ చైర్మన్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకుని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు ఉన్నతధికారులను కోరారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న యార్డు ఉద్యోగులు

## ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లను నమోదు చేసుకోండి

**ఆమనగల్లు, జూలై3, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో ప్రతిరైతు తమ పేర్లను నమోదు చేసుకుని ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని ఆమనగల్లు డివిజన్ వ్యవసాయ సంచాలకులు శోభారాణి కోరారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలోని రైతువేదిక భవనంలో పేర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. రైతులు భూమి పాస్‌బుక్, ఆధార్‌లింక్ పోన్ నెంబర్‌తో సంప్రదించాలని ఆమె సూచించారు. భూమి కల్గిన ప్రతిరైతుకు ఒక యూనిట్ గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు ఆమె వివరించారు. రైతులకు సందేహాలు ఉంటే ఆయా మండలాల వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఏడిఓ శోభారాణి తెలిపారు.



వెంకమ్మగూడలో గడ్డి మందు కొడుతున్న కాంగ్రెస్ నేత వేణుగోపాల్

## సొంత ఖర్చుతో క్లీన్ అండ్ గ్రీన్

**నందిగామ, జూలై 3 ప్రభాతవార్త :** వర్షాకాలం.. పైగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నందిగామ మండలం ఈ వెంకమ్మగూడ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు గుండాల శోభారాణి వేణుగోపాల్ గురువారం గ్రామంలోని పరిసరాలను శుభ్రం చేశారు. అందరం ఆరోగ్యంగా ఉండాలి.. అందులో మేముండాలి అనే సంకల్పంతో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలకు వారు గడ్డి మందు కొట్టారు. సొంత ఖర్చులు వెచ్చించి గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించిన శోభ రాణి వేణుగోపాల్‌ను గ్రామస్తులు అభినందించారు.



ఎల్‌ఓసి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

## బాధితురాలికి సీఎం రిలీఫ్ ఫండ్ సాయం

**నందిగామ జూలై 3 ప్రభాతవార్త:** నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన తోట అనితకు గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వార మంజూరైన ఎల్‌ఓసిని అందజేశారు. కష్టకాలంలో ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు లబ్ధిదారు మహిళ తోట అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నర్సింలు, మాజీ ఎంపీటీసీ దేపల్లె కుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవపేట్ రవీందర్ గౌడ్, జింకల జంగయ్య యాదవ్, రంగాపూర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆకుల జ్ఞానేశ్వర్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాత్లావత్ శ్రీనునాయక్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

**దౌల్తాబాద్ మండలంలో..**

**దౌల్తాబాద్, జూలై 3,ప్రభాతవార్త:** పేదల ఆరోగ్యానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన నాయకోటి.సాయిలుకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 48,000 రూపాయల చెక్కును ఆయన అంద జేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్‌రెడ్డి మాట్లా డుతూ.. నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఒక గొప్ప వరం లాంటిదని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్పుడు వారికి అయ్యే ఖర్చును సీఎం సహాయ నిధి ద్వారా అందిచడం పేదల పాలిట వరం లాంటిది అని అన్నారు.ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఈర్లపల్లి గ్రామానికి చెందిన నారాయణ,శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న కాగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు

## విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న దాతలు

**షాద్‌నగర్, జూలై 3, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్న చిల్కమర్రి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పల్లె నర్సింహ్మారెడ్డి, తెలుగు యాదయ్యలు తమ సొంత ఖర్చులతో టై, బెల్టులు అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు యూనిఫాంతో పాటు టై, బెల్టులు, బూట్లు ఉంటే ఆకర్షణీయంగా ఉండడమే కాక, ఆత్మ విశ్వాసంతో ఉంటారన్నారు. ఈ సందర్భంగా దాతలు పల్లె నర్సింహ్మా రెడ్డి, తెలుగు యాదయ్యలకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగిళ్ల జగదీశ్వర్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**గజ్వేల్ టౌన్, జూలై 3 (ప్రభాతవార్త):** ద్విచక్ర మెకానిక్‌లు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ప్రపంచ టూ వీలర్స్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మెకానిక్‌లు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, మీకు అండగా ఉంటానని తెలిపారు. తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు ద్విచక్ర వాహనంపై తిరిగానని, మెకానిక్‌ల కష్టాలు నాకు తెలుసని అన్నారు. మెకానిక్‌లకు అందరికీ ఆరోగ్య భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇండ్లతో పాటు స్వయం ఉపాధి కొరకు ప్రతి మెకానిక్ సభ్యునికి రూ.10 లక్షల రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూ వీలర్స్ అసోసియేషన్ బాధ్యులతో పాటు గజ్వేల్ మండల అధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, సిహెచ్.నరసింహులు, ధనరాజ్, ఏలూరి సత్యనారాయణ, మీర్జా ముఖ్రాంబేగ్, మన్నె వెంకటేశం, దావత్ మల్లేశం, విష్ణువర్ధన్, కాజాపాషా, స్వామిగౌడ్, మహ్మద్ మోహిన్, అబ్దుల్లా పాల్గొన్నారు.